క్లుప్తంగా

బుడమేరు కాల్వకు మరమ్మతులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బుడమేరు కాల్వలో వరద నీటి ప్రవాహం తక్కువగా ఉండటంతో గురువారం కాల్వకు మరమ్మతు పనులు చేపట్టారు. కాలనీలో వరద నీరు తగ్గినప్పటికీ జక్కంపూడి గ్రామం, షాబాద్, అంబాపురం పరిసరాల్లోని పొలాలు ముంపులోనే ఉన్నాయి. దీంతో జక్కంపూడి కాలనీ సమీపంలోని సీఎన్‌జీ బంక్ వద్ద బుడమేరు కాల్వ బాటిల్ నెక్ తరహాలో ఉండటం వల్ల వరద నీరు కదలడం లేదని గుర్తించారు. దీంతో వెంటనే కాల్వ వెడల్పు, లోతు పెంపునకు పనులు చేపట్టారు. ఒకే దఫా అధిక సంఖ్యలో పొక్లెయిన్‌లతో పూడిక తీత పనులతో పాటు కాల్వ నుంచి పెద్ద ఎత్తున మట్టిని తీశారు. దీంతో బుడమేరు కాల్వలో నీటి ప్రవాహం పెరిగింది.

సమాజ హితమే సంస్కార భారతి లక్ష్యం



విజయవాడ కల్చరల్: సమాజ హితమే లక్ష్యంగా సంస్కార భారతి సాంస్కృతిక సేవా సమితి పనిచేస్తుందని ఆ సమితి రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ పీవీఎస్ కృష్ణ అన్నారు. సంస్కార భారతి ఆధ్వర్యంలో అయోధ్యనగర్‌లోని రాష్ట్రీయ స్వయం సేవక్ కార్యాలయం హైందవిలో గురువారం వరద బాధిత ప్రాంతాల్లోని కళాకారులకు రెండవ విడత ఆర్థిక సహాయ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమాన్ని ప్రారంభించిన కృష్ణ మాట్లాడుతూ కళాకారులను ఆదుకోవడానికి ముందుకు రావాలని సాంస్కృతిక సంస్థలకు పిలుపునిచ్చారు. కళాకారులను, సంగీత సాహిత్యాలను గౌరవించిన చోట ఆ ప్రాంతం సుభిక్షంగా ఉంటుందన్నారు. సంస్కార భారతి ప్రధాన కార్యదర్శి దర్భా శ్రీనివాస్ సామాజిక చైతన్యం కళాకారులతోనే సాధ్యమన్నారు. అనంతరం 30 మంది కళాకారులకు ఆర్థిక సాయం అందించారు. శ్రీరాం పాఠశాలల వ్యవస్థాపకుడు సురేష్, సంస్థ ప్రతినిధులు జొన్నవిత్తుల రామకృష్ణ, సీతారత్నం, విశ్వకాంత్ పాల్గొన్నారు.

ధర్మపథం వేదికపై దేవీ కీర్తనం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై గురువారం గరికపాటి వెంకట ప్రభాకర్ అమ్మవారి భక్తి కీర్తనలను ఆలపించారు. ఎస్ఎస్ మ్యూజిక్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ప్రభాకర్‌ను ఆలయ ఈవో రామారావు సత్కరించి అమ్మవారి చిత్రపటాన్ని అందజేశారు.

మార్కెట్‌లోకి హ్యుందాయ్ అల్‌కజార్



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): కుశలవ హ్యుందాయ్ షోరూం ది బోల్డ్ న్యూ హ్యుందాయ్ అల్‌కజార్ కారును మార్కెట్‌లోకి విడుదల చేసింది. గురువారం కుశలవ హ్యుందాయ్ మేనేజింగ్ డైరెక్టర్ చుక్కపల్లి సిద్దార్థ్, ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ ప్రవీణ్, యూనియన్ బ్యాంక్ చీఫ్ మేనేజర్ శ్రీనివాస్ కారును మార్కెట్‌లోకి విడుదల చేశారు. ఈ సందర్భంగా చుక్కపల్లి సిద్ధార్థ మాట్లాడుతూ అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో అల్‌కజార్ రూపొందించారన్నారు. 70కు పైగా సేఫ్టీ ఫీచర్లు, ఆకర్షణీయమైన డిజైన్, ఎడాస్‌లెవెల్-2 అనే 19 సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయన్నారు. ఫస్ట్, సెకండ్‌రో వైర్‌లెస్ చార్జర్‌తో, 2 రకాల ఇంజిన్లు(1.5 టర్బో, 1.5 డీజిల్) అందరికీ అందుబాటు ధరలో లభిస్తోందన్నారు. కొత్త హ్యుందాయ్ అల్‌కజార్ ప్రారంభ ధర రూ. 14.99లక్షలు (పెట్రోల్ ఎక్స్ షోరూం), రూ. 15.99 (డీజిల్ ఎక్స్ షోరూం ధర) లభిస్తాయన్నారు. టెస్ట్ డ్రైవ్ కోసం దగ్గరలోని కుశలవ షోరూంలో సంప్రదించాలని కోరారు.

విద్యార్థులకు స్టేషనరీ, పుస్తకాలు పంపిణీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పాతబస్తీ పూజారి వారి వీధిలోని శ్రీ బాలగణపతి ఆలయంలో గురువారం స్వామి వారు శ్రీ విద్యాగణపతిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం స్వామి వారి సన్నిధిలో సుప్రభాత సేవతో కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. అనంతరం సహస్రనామార్చన తదితర వైదిక కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారికి సహస్ర మోదక (ఉండ్రాళ్ళు) పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు ప్రముఖులు స్వామి వారిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. సాయంత్రం స్వామి వారికి కల్పవృక్ష వాహన సేవను వైభవంగా నిర్వహించారు. వాహన సేవలో వివిధ భజన మండళ్లకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ

స్వామి వారి సన్నిధిలో వివిధ పాఠశాలల విద్యార్థులకు పుస్తకాలను ఇతర స్టేషనరీ సామగ్రిని నిర్వాహకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో స్వామి వారికి పూజలు నిర్వహింపజేశారు. కార్యక్రమాలను కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గ్రంధి శ్రీనివాసరావు, మామిడి లక్ష్మీ వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

ఎంత కష్టం..ఎంత నష్టం..!

- రైస్ షాప్‌లోకి జొరబడిన వరద నీరు
- బియ్యం బస్తాలు తడిసి రూ.5లక్షల నష్టం
- చిరు వ్యాపారులను చావుదెబ్బ తీసిన వరద

భవానీపురం(విజయవాడపశ్చిమ): చిరు వ్యాపారులను బుడమేరు వరద కోలుకోలేని దెబ్బ తీసింది. ఊర్మిళానగర్ మెయిన్ రోడ్‌లో శ్రీలక్ష్మీ బాలాజీ రైస్ అండ్ జనరల్ స్టోర్స్ పేరుతో బియ్యం విక్రయిస్తూ జీవనం సాగిస్తున్న రామిశెట్టి లక్ష్మి, వెంకటేశ్వరరావు దంపతులకు చెందిన దుకాణంలోకి వరద నీరు వెళ్లి దాదాపు 250 బియ్యం బస్తాలు పూర్తిగా తడిసి పనికి రాకుండా పోయాయి. మరి కొన్ని బస్తాలు పాక్షికంగా తడిసినా అవి కూడా తినేందుకు పనికివచ్చే పరిస్థితిలో లేవు. గురువారంతో మెయిన్ రోడ్‌లోని వరద నీరు మొత్తం పోగా దుకాణం తెరిచి చూసిన ఆ దంపతులకు గుండె చెరువయ్యింది. పూర్తిగా తడిసిపోయిన బియ్యం బస్తాలు కొన్ని నాని పిగిలిపోయి బయటకు వచ్చిన బియ్యం దుర్వాసన వస్తోంది. వాటిని షాపు ముందు పడేశారు. పాక్షికంగా తడిసిన బస్తాల్లోని బియ్యాన్ని చేపలు, రొయ్యల చెరువుల్లో మేతకు ఉపయోగపడతాయేమోనని షాపులోనే ఆరబెట్టుకున్నారు. దిక్కుతోచని స్థితిలో దైన్యం నిండిన కళ్లతో ఉబికి వస్తున్న కన్నీళ్లను పంటిబిగువున ఆపుకొంటున్నారు.



వరద నీటిలో తడిసి పనికిరాకుండా పోయిన బియ్యం బస్తాలను బయట పడేసిన దృశ్యం



తడిసిన బియ్యం బస్తా పిగిలిపోయి బయటకు వచ్చిన బియ్యం



బుడమేరు వరద మమ్మల్ని చావుదెబ్బ తీసింది

బుడమేరు వరద రూపంలో ముంచుకు వచ్చిన ఉపద్రవానికి తప్పిదం ఎవరిదైనా నష్టపోయింది సామాన్యులు, మాలాంటి చిరువ్యాపారులే. ఈ నెల 2వ తేదీ ఉదయం 6.30 గంటల తరువాత ఒక్కసారిగా వరద నీళ్లు వచ్చేసి ఊర్మిళానగర్‌ను ముంచేశాయి. షాపు పైనే ఉంటున్నా దాదాపు నడుం లోతుకుపైగా వచ్చిన నీళ్లతో కిందకి దిగలేని పరిస్థితి. అప్పు చేసి బియ్యం వ్యాపారం చేసుకుంటూ కాలం గడుపుతున్న తరుణంలో బుడమేరు వరద చావు దెబ్బ తీసింది. కోలుకోవడానికి ఎంత కాలం పడుతుందో తెలియదు. భగవంతుడిపై భారం వేయడం తప్ప ఎవరినీ నిందించలేని పరిస్థితిలో ఉన్నాం.

– రామిశెట్టి లక్ష్మి, ఊర్మిళానగర్

వ్యర్థాలతోనే సహజీవనం

పాత ఆర్.ఆర్.పేట వాసుల ఇబ్బందులు

విద్యాధరపురం(విజయవాడపశ్చిమ): పది రోజులుగా వరద ముంపులోనే సహజీవనం చేసిన పాత ఆర్.ఆర్.పేట నివాసితులు వరద పూర్తిగా తగ్గినప్పటికీ ఇళ్లలో పాడైన వస్తువులు, వరదలకు కొట్టుకు వచ్చిన వ్యర్థాలతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా మహంకాళమ్మ గుడి వీధి, బీరువాల కంపెనీ రోడ్డు, సాయిబాబా గుడిరోడ్డులో ఏ ఇంటి ముందు చూసినా కుప్పలుకుప్పలుగా వ్యర్థాలు పేరుకుపోయి తీవ్ర దుర్గంధంతో ఇళ్లలో ఉండలేని పరిస్థితి నెలకొందని స్థానికులు వాపోతున్నారు. రోజుల తరబడి చెత్త ఇళ్ల ముందే ఉండటంతో ఎక్కడ అంటువ్యాధులు ప్రబలుతాయోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క ఇళ్లలోని వస్తువులు, సామానులు కొట్టుకుపోవడంతో కట్టుబట్టలతో రోడ్డున పడ్డామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం మంచి నీరు తాగేందుకు ఒక్క గ్లాసు కూడా లేని పరిస్థితిలో రోడ్డున పడ్డామని ప్రభుత్వమే తమను ఆదుకోవాలని వారంతా ఎదురు చూస్తున్నారు.



వ్యర్థాలతో నిండిపోయిన పాత ఆర్.ఆర్.పేటలోని వీధులు



కట్టుబట్టలతో రోడ్డున పడ్డాం...

ఒక్కసారిగా వరద ప్రవాహం మా ఇంటిని ముంచెత్తడంతో ఎక్కడ సామానులను అక్కడే వదిలేసి బయటకు పరుగులు తీసి ప్రాణాలను కాపాడుకున్నాం. ఇప్పటివరకు దాతలు, ప్రభుత్వం అందించిన తాగునీరు, ఆహారంతో కడుపు నింపుకొంటున్నాం. వరద తగ్గిన తరువాత ఇంటికి వచ్చి చూసుకుంటే కొన్ని సామానులు, బట్టలు కొట్టుకుపోగా ఫ్రిజ్, కూలర్, వాటర్ మోటర్‌లు తడిసి ఎందుకూ పనికి రాకుండా పోయాయి. కూలి పనులు చేసుకుని బతికే మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకోవాలి.

– చింత రమాదేవి, మహంకాళమ్మ గుడి వీధి, పాత ఆర్.ఆర్.పేట

శ్రీనివాస్ ధైర్య సాహసాలు స్ఫూర్తిదాయకం



భవానీపురం(విజయవాడపశ్చిమ): భారత ప్రభుత్వ కీర్తిచక్ర పురస్కార గ్రహీత, నిస్వార్థ సేవకుడు, ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ అధికారి పందిళ్లపల్లి శ్రీనివాస్ జయంతి కార్యక్రమం గురువారం భవానీపురంలో జరిగింది. ఏపీ పీటీడీ (ఆర్టీసీ) బీసీ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్వీ శేషగిరిరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు రాష్ట్రాలను గడగడలాడించిన గంధపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను మొట్టమొదటిసారిగా అదుపులోకి తీసుకున్న శ్రీనివాస్ మన తెలుగువాడు కావడం గర్వకారణమన్నారు. అయితే వీరప్పన్ చేతిలోనే దారుణంగా చనిపోవడం దురదృష్టకరమన్నారు. కార్యక్రమంలో ఏపీ చాత్తాద శ్రీవైష్ణవ సంఘం నాయకురాలు ఎస్వీ యశోద, పి.నాగభూషణం, అంకాని నాగరాజు, మజ్జి ప్రసాద్, పి.వెంకటేశ్వరరావు, పార్వతి, టి.ప్రమీల, ధనలక్ష్మి, నాగేశ్వరి, అమృత పాల్గొన్నారు.

వరద బాధితులకు ఎమ్మెల్సీ కుంభా సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపులో సర్వం కోల్పోయిన బాధితులకు వైఎస్సార్ సీపీ ఎమ్మెల్సీ డాక్టర్ కుంభా రవిబాబు దుస్తులు, నిత్యావసర సరుకులు అందజేశారు. వరద ముంపు ప్రాంతాల్లో ఒకటైన అజిత్‌సింగ్‌నగర్‌లో ఆయన గురువారం పర్యటించి బాధితులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా అందరికీ సాయం అందిస్తున్నామని చెబుతున్నప్పటికీ ఇళ్లు మునిగిపోయి కట్టుబట్టలతో బయటకు వచ్చేసిన తమలాంటి అసలైన బాధితుల వరకు రావడం లేదని పలువురు ఆయన దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో నేషనల్ ట్రైబల్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మానుపాటి నవీన్, ఏపీ యానాదుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కుడుమల రామచంద్రయ్య, ఎన్‌టీఎఫ్ ప్రధాన కార్యదర్శి కుంభా ఉదయ్ కుమార్, ఎన్‌టీఎఫ్ నంద్యాల, నెల్లూరు జిల్లాల అధ్యక్షులు నాగసారి సుంకన్న, పులి చెంచయ్య తదితరులు పాల్గొన్నారు.



బాధితులకు దుస్తులు, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న కుంభా రవిబాబు తదితరులు



నిత్యావసర సరుకులు అందుకున్న కాలనీ వాసులు

వరద బాధితులకు నిత్యావసర సరుకులు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపుతో సర్వం కోల్పోయిన బాధితులకు గురువారం నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. క్రైస్ట్ గాస్పెల్ మినిస్ట్రీస్ జి.విజయరాజు సహకారంతో కాలనీలోని ప్రార్థన మందిరం వద్ద సుమారు 300 మందికి నెల రోజులకు అవసరమైన పప్పులు, ఇతర నిత్యావసర సరుకులను అందించారు. కార్యక్రమంలో సంఘ కాపరి ఎస్.పాల్, బిషప్ ఎండీ రాజు, నతానియేల్, జాన్‌వెస్లీ, వందనం, సంజీవ్ శేఖర్, రమేష్, జేమ్స్ పాల్గొన్నారు.

బాధితులకు అమృత హస్తం ట్రస్ట్ సాయం

భవానీపురం(విజయవాడపశ్చిమ): వరద బాధితులకు మేము సైతం అంటూ అమృత హస్తం చారిటబుల్ ట్రస్ట్ ఆపన్న హస్తం అందించింది. ట్రస్ట్ ప్రెసిడెంట్ దారా కరుణశ్రీ, సభ్యులతో పాటు శ్రీజ హెల్పింగ్ హ్యాండ్స్ (హైదరాబాద్), పూర్ణ ఈవెంట్స్ కలిసి గురువారం విద్యాధరపురం చెరువు సెంటర్‌లో స్టీల్ కంచం, గ్లాస్, దుప్పటి, టవల్స్, తినుబండారాలతో కూడిన కిట్స్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దారా కరుణశ్రీ మాట్లాడుతూ వరదలు వచ్చిన నాటి నుంచి తమ ట్రస్ట్ ద్వారా నగరంలోని వివిధ ముంపు ప్రాంతాలలో పర్యటించి అవసరమైన సుమారు 50 వేల మంది బాధితులకు సాయం అందించామని తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గుడివాడ రామకృష్ణ, పోలీస్ ఏఎస్ఐ టి.నాగరాజు, హెడ్ కానిస్టేబుల్ దుర్గారావు, కానిస్టేబుల్ ఉమామహేశ్వరరావు, పూర్ణా ఈవెంట్స్ వలంటీర్లు పాల్గొన్నారు.



బాధితులకు కిట్లు అందజేస్తున్న దారా కరుణశ్రీ తదితరులు

రామరాజ్యనగర్‌లో ఇంకా మురుగు నీటిలోనే ఉన్న ఇళ్లు





పాయకాపురంలో ఉచిత వస్తువుల కోసం ఎగబడుతున్న వరదబాధితులు



జక్కంపూడి కాలనీ పాఠశాలలో చేరిన బురద నీరు

ఎటు చూసినా ఆకలి కేకలే!

వరద ముంపు ప్రాంతాల్లో నీరు లాగేయగానే ప్రభుత్వం ఆహారం, మంచినీటి సరఫరా నిలిపివేసింది. నీరు పోయినా బురద కొట్టుకుపోయిన ఇళ్లు, సామాన్లను శుభ్రం చేసుకోవడంతోనే సరిపోతున్న బాధితులకు వంట చేసుకునే సమయమేది...ఒకవేళ వంట చేసుకుందామన్నా పొయ్యి పనిచేయదాయె..పొయ్యి పనిచేసినా చేతిలో చిల్లిగవ్వ లేదాయె...ఈ నేపథ్యంలో గురువారం ముంపు ప్రాంతంలో ఎటు వెళ్లినా ఆకలికేకలే వినపడుతున్నాయి.

–సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

సహాయ కార్యక్రమాల్లో సహకరించిన వారికి కృతజ్ఞతలు

వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర



పటమట(విజయవాడతూర్పు): బుడమేరు వరద నుంచి విజయవాడ సత్వరం కోలుకునేందుకు సహాయ కార్యక్రమాలు చేసిన అందరికీ వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర గురువారం ఓ ప్రకటనలో కృతజ్ఞతలు తెలిపారు. నగర వ్యాప్తంగా ఉన్న 64 డివిజన్లలో 32 డివిజన్లలో వరద ప్రభావితం ఉందని చెప్పారు. నగరంలో ఉన్న ఐదు డ్రైనేజీ పంపింగ్ స్టేషన్లు, కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్ (విజయవాడ నగరంలో తాగునీటిని సరఫరా చేసే ప్రధాన హెడ్ వాటర్ వర్క్స్) వరద ప్రభావానికి పాడైపోయిందని, దీన్ని త్వరితగతిన పరిష్కరించామన్నారు. వీఎంసీలో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూంలో 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉండేటట్టు వారి సమస్యలను పరిష్కరించేందుకు, ఫిర్యాదులకు హెల్ప్ లైన్ నంబర్లు పెట్టడమే కాకుండా సామాజిక మాధ్యమం ద్వారా కూడా ప్రజల సమస్యలను తెలుసుకుని పరిష్కరించామన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో ఉన్నవారికి ప్రత్యేకంగా 50 ట్రాక్టర్లతో ఆహారాన్ని అందించామని, 230 ట్యాంకర్లతో తాగునీటిని సరఫరాను చేశామన్నారు. ట్రాక్టర్లు వెళ్లలేని చోట 11 మత్స్య శాఖ బోట్లలో ఆహారాన్ని తీసుకువెళ్లి అవసరమైన ప్రతి ఒక్కరికీ అందించామన్నారు. కొన్ని ప్రదేశాలలో బోట్లు కూడా వెళ్లలేని పరిస్థితి ఉన్నప్పుడు డ్రోన్ల సహాయంతో ఆహారాన్ని అందించే విధంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. శివారు ప్రాంతాలకు హెలికాప్టర్ ద్వారా ఆహారాన్ని అందించామన్నారు. వరదలతో ప్రజలతో పాటు మూగ జీవాలను కూడా కాపాడే చర్యలు తీసుకున్నామని, వరద అనంతరం ప్రజలు అనారోగ్యం బారిన పడకుండా ఉండేందుకు, దోమల నియంత్రణకు డ్రోన్ల సహాయంతో ఎంఎల్ ఆయిల్స్ స్ప్రే, ఫాగింగ్ చేస్తూ, యాంటీ లార్వా ఆపరేషన్స్ చేసినట్లు వివరించారు. 352 ఆయిల్ ఇంజన్స్ తో నిలువ ఉన్న వరద నీరును అధికారులు ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారని, 462 వాహనాలతో వరదల వల్ల పేరుకుపోయిన వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగిస్తూ, ప్రత్యేకమైన పాయింట్లో డీసిల్టింగ్ చేసుకుంటూ, వరదనీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకున్నామన్నారు.

వరద ముంపు బాధితులకు అండగా ఉంటాం

పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి

భవానీపురం(విజయవాడపశ్చిమ): పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే యలమంచిలి సత్యనారాయణ (సుజనా) చౌదరి గురువారం విద్యాధరపురం లేబర్ కాలనీ, చెరువు సెంటర్‌లో పర్యటించారు. వరద ముంపు బాధిత కుటుంబాలతో మాట్లాడి అధైర్య పడవద్దని, అన్ని విధాలా ఆదుకుని అండగా నిలబడతామని ధైర్యం చెప్పారు. బాధితులకు సాయం అందించటంలో ప్రభుత్వ అధికారులు, సుజనా ఫౌండేషన్ సిబ్బంది సమన్వయంతో పని చేస్తున్నారని చెప్పారు. నష్టం అంచనా వేసేందుకు ఎన్యూమరేషన్ ప్రక్రియ వేగవంతంగా జరుగుతోందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో బాధితుల జీవన స్థితిగతులను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. అనంతరం 44వ డివిజన్‌లో వరద సహాయక చర్యల్లో పాల్గొంటూ గుండెపోటుతో మరణించిన కిలాని దుర్గారావు కుటుంబాన్ని పరామర్శించారు. కార్యక్రమంలో నాగుల్‌మీరా, ఎం. దుర్గారావు, తిరుపతి అనూష, బి.శ్రీనివాస్, బి.శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.



లేబర్‌కాలనీలో బాధిత మహిళతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుజనా చౌదరి

పారిశుద్ధ్య నిర్వహణపై ఆకస్మిక తనిఖీ

వ్యర్థాలను సత్వరమే తొలగించాలి

పటమట(విజయవాడతూర్పు) వరదతో ఏర్పడిన వ్యర్థాలను తొలగించటంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్చరించారు. ఆయన గురువారం వరద ప్రభావిత ప్రాంతాలైన గుణదల, సింగ్‌నగర్, శాంతినగర్, సన్‌రైజ్ కాలనీ, పాత రాజరాజేశ్వరి పేట, కొత్త రాజరాజేశ్వరి పేట, పైపులు రోడ్డు, ప్రకాష్ నగర్, రాజీవ్ నగర్, రామవరప్పాడు, కండ్రిక, వాంబే కాలనీ, ఉడా కాలనీలలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వార్డు సచివాలయాల కార్యదర్శులతో పాటు ఆయన బైకుపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పారిశుద్ధ్య నిర్వహణలో ఎటువంటి లోపం లేకుండా చర్యలు తీసుకోవాలని, వరద వ్యర్థాలను త్వరితగతిన తొలగించాలని పారిశుద్ధ్య కార్మికులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఇతర మున్సిపాలిటీల నుంచి వచ్చిన కార్మికులతో ఆయన మాట్లాడారు. వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. భోజనం, వసతిపై ఆరా తీశారు. పర్యటనలో కండ్రికలో ప్రజలు తాగునీటి సరఫరాపై కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో వెంటనే ఆయన స్థానికంగా నీటిని సరఫరా చేయాలని అధికారులను ఆదేశించారు.



బైక్‌పై వెళ్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

ఎన్యూమరేషన్ చేయించండి సారూ..!

భవానీపురం(విజయవాడపశ్చిమ): బుడమేరు వరద ముంపునకు గురైన గొల్లపూడి పంచాయతీ పరిధి రామరాజ్యనగర్ (కబేళా ఇండస్ట్రియల్ ఏరియా)లో ఎన్యూమరేషన్‌కు వచ్చిన అధికారులు అది తమ పరిధి కాదని చెప్పారు. సరేనని గొల్లపూడి పంచాయతీ కార్యాలయానికి వెళితే అది మున్సిపల్ కార్పొరేషన్ పరిధి అని చెప్పారు.

కబేళా రోడ్‌లో పౌండ్రీ నడుపుకొనే వ్యక్తి ఇచ్చిన చిన్న షాపులో గజ్జెల పుష్పలత(బుజ్జి) టిఫిన్ హోటల్ నడుపుకొంటూ కుటుంబాన్ని పోషించుకుంటోంది. వరద నీరు హోటల్‌లోకి వచ్చేసి గ్రైండర్, ఫ్రిజ్ వంటివన్నీ మునిగిపోయాయి. షాపు ముందు పెట్టుకున్న కౌంటర్ బల్ల కూడా వరద నీటిలో కొట్టుకుపోయింది. ఈ క్రమంలో వరద బారినపడి నష్టపోయిన వారికి ఎన్యూమరేషన్ చేస్తున్న రెవెన్యూ సిబ్బంది అక్కడకు రాగా పుష్పలత తన గోడు చెప్పుకుంది. అయితే వారు అది తమ పరిధి కాదని చెప్పటంతో ఆమె కన్నీటి పర్యంతమయ్యింది. జరిగిన నష్టాన్ని కళ్లారా చూసి అంచనా వేయటానికి పరిధి ఏమిటో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేసింది. ఎన్యూమరేషన్ ద్వారా ఎంతో కొంత మొత్తం వస్తే తిరిగి టిఫిన్ హోటల్ తెరుచుకుని కుటుంబాన్ని పోషించుకోగలుగుతానని చెబుతోంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు తన దుకాణానికి జరిగిన నష్టాన్ని ఎన్యూమరేషన్ చేయించి నష్టపరిహారం ఇప్పించాలని వేడుకుంటోంది.





వరద నీటిలో మునిగిపోయి బురద కొట్టుకుపోయిన హోటల్ (ఇన్‌సెట్) గజ్జెల పుష్పలత(బుజ్జి)

14న కవయిత్రి మొల్ల కాంస్య విగ్రహావిష్కరణ

విజయవాడరూరల్: ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 14వ తేదీ శనివారం రామాయణ కావ్య జనయిత్రి, తొలి తెలుగు కవయిత్రి మొల్ల కాంస్య విగ్రహావిష్కరణ విజయవాడ లోని తుమ్మలపల్లి కళాక్షేత్రం వద్ద జరుగుతుందని ఎన్టీఆర్ జిల్లా శాలివాహన సంఘం అధ్యక్షుడు బొమ్మిన శ్రీనివాసరావు తెలియజేశారు. విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలో గురువారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మైసూర్ మహారాజా, మైసూర్ ఎంపీ యదువీర కృష్ణదత్త చామరాజ వడియార్ చేతుల మీదుగా శాలివాహనుల ఆడపడుచు మొల్ల కాంస్య విగ్రహావిష్కరణ జరుగుతుందన్నారు. ఆంధ్రప్రదేశ్ కుమ్మరి శాలివాహన సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పలువురు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, దక్షిణ భారత కుమ్మరి సంఘం అధ్యక్షుడు శివకుమార చాడిశెట్టి, ఆంధ్ర, తెలంగాణ, కర్నాటక రాష్ట్రాల నుంచి అధిక సంఖ్యలో శాలివాహనులు హాజరవుతున్నారని తెలియజేశారు.



మొల్ల జయంతి వేడుకలను పురస్కరించుకుని కాంస్య విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలియజేశారు. సమావేశంలో విజయవాడ నగర శాలివాహన సంఘం అధ్యక్షుడు బి.దుర్గాప్రసాద్, ప్రధానకార్యదర్శి డి.సత్యనారాయణమూర్తి, సంఘ నాయకులు సి.శ్రీనివాసరావు, ఎస్.శివ, ఆర్.కోటేశ్వరరావు, ఎస్.నాగబాబు తదితరులు పాల్గొన్నారు.

సాటి మనిషికి సహాయం చేయడంలోనే దైవత్వం

భవానీపురం(విజయవాడపశ్చిమ): మానవ సేవే మాధవ సేవగా భావించి ఆపదలో ఉన్న సాటి మనిషికి సాయం చేయడంలోనే దైవత్వం ఉందని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆచార్యులు లక్ష్మీ నరసింహచార్యులు అన్నారు. పారిశ్రామికవేత్త లగడపాటి రాజగోపాల్ మాతృమూర్తి రామలక్ష్మి సహకారంతో గొల్లపూడి ల్యాంకో టౌన్‌షిప్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో గురువారం వంద మంది బ్రాహ్మణులకు నిత్యావసరాల పంపిణీ కార్యక్రమం జరిగింది. దాత రామలక్ష్మి మాట్లాడుతూ భగవంతుని సన్నిధిలో పేద బ్రాహ్మణులకు సేవ చేయడం అదృష్టంగా భావిస్తున్నానని చెప్పారు. వేద పండితుడు అక్కిపెద్ది ప్రసాద్ నిర్వహణలో వేదాశీర్వాదం అందించారు. కార్యక్రమంలో సాయిలీల, సామ్రాజ్యం, సుజాత, సుబ్బు, లక్ష్మి, సత్యనారాయణ, శ్రీనివాస రాజు పాల్గొన్నారు.

నైతికతే నిజమైన స్వేచ్ఛ

ఆటోనగర్(విజయవాడతూర్పు): నైతికతే నిజమైన స్వేచ్ఛ మొరాలిటీ ఈజ్ ఫ్రీడమ్ అనే నినాదంతో దేశ వ్యాప్త ఉద్యమానికి శ్రీకారం చుట్టినట్టు విజయవాడ నార్త్ జమాతె ఇస్లామి హింద్ మహిళ రాష్ట్ర కార్యదర్శి ప్రముఖ రచయిత్రి షరీఫా బేగం అన్నారు. విజయవాడ జమాతె ఇస్లామి హింద్ కార్యాలయంలో నైతికతే నిజమైన స్వేచ్ఛ అనే వాల్‌పోస్టర్‌ను గురువారం ఆమె ఆవిష్కరించారు.